నమస్తే తెలంగాణ
ఖమ్మం
5 | ఖమ్మం, శుక్రవారం 29 మార్చి 2024 | KHAMMAM

మార్చిలోనే మండే ఎండ!

- ఏప్రిల్, మే నెలల్లో తీవ్రత మరీ ఎక్కువ
- వడదెబ్బతో జర జాగ్రత్త.. నిర్లక్ష్యం వహిస్తే అనారోగ్యం తప్పదు..
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్య నిపుణులు
- అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని సూచన

ఉదయం 10 గంటలు దాటక ముందే 'భగ భగ'

భద్రాద్రి కొత్తగూడెం, మార్చి 28 (నమస్తే తెలంగాణ)/ఖమ్మం/ఇల్లెందు రూరల్ : మార్చి ముగియనే లేదు. ఎండలు మాత్రం దంచికొడుతున్నాయి. మార్చిలోనే ఎండలు ఇలా ఉంటే ఇక మే నెలలో ఎండలు ఎలా ఉంటాయోనని ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఉదయం 10 గంటలకే సూరీడు భగ భగమంటున్నాడు. రాత్రిళ్లు 10 గంటలు దాటిన తర్వాత ఉక్కపోతలు ప్రారంభమయ్యాయి. వరుసగా మూడు రోజుల నుంచి ఉభయ జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 37, 38 డిగ్రీలు నమోదవుతున్నాయి. బుధవారం రెండు జిల్లాల్లో 39 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. గ్రామాల్లో ఉపాధి పనులకు వెళ్లే కూలీలు పొద్దు పొడవక ముందే ఉపాధి పనులకు వెళ్లి మధ్యాహ్నానికి ఇంటికి తిరిగి వస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే బడి పిల్లలకు ఒంటి పూట బడులు అమలు చేస్తున్నది. మరోవైపు ఇంటర్మీడియట్ పరీక్షలు ఇప్పటికే పూర్తికాగా, రేపటితో పదోతరగతి పరీక్షలూ ముగియనున్నాయి. ఎండల నేపథ్యంలో మార్కెట్‌లో ఫ్రిజ్‌లు, కూలర్లు, ఏసీలకు డిమాండ్ పెరిగింది. ఎండకు తాళలేని ప్రజలు మధ్యాహ్నం కొబ్బరి బొండాలు, శీతల పానీయాలు, లస్సీ, నిమ్మరసం, చెరుకు రసం, మజ్జిగ తాగి ఉపశమనం పొందుతున్నారు. ఏప్రిల్‌లోనే సుమారు 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయంటే ఇక మే నెలలో వచ్చే రోహిణి కార్తె ప్రచండమైన ఎండలను ఇట్టే అంచనా వేయవచ్చు.

వడదెబ్బ లక్షణాలు ఇలా..

అధిక ఉష్ణోగ్రతలు నమోదైనప్పుడు మన శరీరంలో నీరు చెమట రూపంలో బయటకు వెళ్తుంది. ఎప్పటికప్పుడు తాగునీరు, ద్రవ పదార్థాలు తీసుకోకపోతే 'డీ హైడ్రేషన్' సమస్య ఉత్పన్నమవుతుంది. ఫలితంగా వడదెబ్బ తగిలే అవకాశం ఉంటుంది. వడదెబ్బ తగిలితే చర్మం పోడిబారుతుంది. దప్పిక ఎక్కువగా ఉంటుంది. తరచూ వాంతులవుతాయి. గుండె కొట్టుకునే వేగం పెరుగుతుంది. నీరసం ఆవహిస్తుంది. చిరాకు వస్తుంది. కొన్నిసార్లు స్పృహ తప్పిపోయే ప్రమాదం ఉంటుంది. తీవ్రత ఎక్కువైతే కోమాలోకి వెళ్లే ప్రమాదం ఉంటుంది.

నివారణ చర్యలు..

సాధారణంగా చిన్నపిల్లలు, వృద్ధులు, క్రీడాకారులు, ఆరుబయట పనిచేసే కార్మికులు ఎక్కువగా వడదెబ్బకు గురవుతుంటారు. వడదెబ్బ బారిన పడకుండా ఉండాలంటే ప్రతిఒక్కరూ ఆహారంలో మజ్జిగ, పండ్లు తీసుకోవాలి. తేలికగా జీర్ణమయ్యే పదార్థాలనే తినాలి. సూర్యరశ్మిని గ్రహించే గాఢమైన రంగుల దుస్తులు ధరించకూడదు. తేలికపాటి రంగుల దుస్తులనే ధరించాలి. తలపై విధిగా టోపీ లేదా తలపాగా ఉంచాలి. నిత్యం గొడుగును వెంట పెట్టుకోవాలి. వీలైనంత ఎక్కువ నీరు తాగాలి. కలుషిత నీరు తాగితే అతిసారం ప్రబలే అవకాశం ఉంటుంది. శీతల పానీయాలను తాగకపోవడమే మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. వడదెబ్బను ప్రతిఒక్కరూ మెడికల్ ఎమర్జెన్సీగా గుర్తించాలి. లేకపోతే ప్రాణాలకే ప్రమాదం. వడదెబ్బకు గురైన వ్యక్తిని వెంటనే నీడ ఉన్న ప్రదేశానికి చేర్చాలి. బిగుతైన దుస్తులు ధరించి ఉంటే శరీరానికి గాలి తగిలే విధంగా చేయాలి. పరిశుభ్రమైన రుమాలుతో బాధితుడి ఒంటిని తుడవాలి. చల్లనినీరు లేదా మజ్జిగ లేదా గ్లూకోజ్ తాగించాలి. ఇలా చేస్తే బాధితుడికి ఉపశమనం కలుగుతుంది. పాక్షిక అపస్మారక స్థితి లేదా పూర్తిగా స్పృహ తప్పినట్లుగా కనిపిస్తే బాధితుడు పడుకున్న బెడ్‌పై కాళ్ల వైపు ఎత్తైన దిండు అమర్చి శరీరం పైభాగం కంటే పాదాలు ఎత్తుగా ఉండేలా చూడాలి. డాక్టర్ సలహా మేరకు 500 మిల్లీ గ్రాముల పారాసిట్మాల్ మాత్ర ఇవ్వాలి. లేదా 300 మిల్లీ గ్రాముల పారాసిట్మాల్‌ను ఇంజెక్షన్ రూపంలో ఇవ్వాలి. తర్వాత బాధితుడి శరీర ఉష్ణోగ్రత క్రమంగా తగ్గుతుంది.

ఎండకు బయట తిరగొద్దు

ఎండల తీవ్రత దృష్ట్యా అత్యవసర పనులు ఉంటేనే బయటకు వెళ్లాలి. రోజురోజుకూ ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదవుతున్నందున శరీరంలో నీటి శాతం ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి. పండ్ల రసాలు, కొబ్బరిబొండా, గ్లూకోజ్ వాటర్, ఎక్కువగా తీసుకోవడం అలవాటు చేసుకోవాలి. చిన్న పిల్లలు బయటకు వెళ్లకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి. ఎక్కువ సమయం చల్లటి ప్రదేశాల్లో ఉండేలా చూసుకోవాలి. వాంతులు, విరోచనాలు, డీహైడ్రేషన్, వడదెబ్బకు గురైనప్పుడు వైద్యులను వెంటనే సంప్రదించాలి.

– డాక్టర్ లోహిత, పీహెచ్‌సీ వైద్యురాలు, కొమరారం, ఇల్లెందు మండలం

భూముల పరిరక్షణకు పకడ్బందీ చర్యలు : కలెక్టర్ వీపీ గౌతమ్

సమావేశంలో మాట్లాడుతున్న ఖమ్మం కలెక్టర్ గౌతమ్

ఖమ్మం, మార్చి 28 : ప్రభుత్వ భూముల పరిరక్షణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో భూ రక్షణ బృందాలతో ప్రభుత్వ స్థలాల పరిరక్షణపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విలువైన ప్రభుత్వ స్థలాలను గుర్తించి.. జాబితాను తగు చర్యల నిమిత్తం భూ రక్షణ బృందాలకు అందజేశామని, వాటిపై తీసుకున్న చర్యలపై నివేదిక సమర్పించాలన్నారు. స్థలాల వారీగా అధికారులు చేపట్టిన చర్యలపై కలెక్టర్ సమీక్షించారు. ఖాళీ స్థలాల్లో క్రమబద్ధీకరణ జీవో 59లో చేసుకున్న దరఖాస్తులు తిరస్కరణకు గురైన చోట వెంటనే స్థలాలను స్వాధీనం చేసుకొని రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. వైఎస్సార్ కాలనీలో ఎక్స్ సర్వీస్‌మెన్‌లకు కేటాయించిన అసైన్డ్ భూమిపై సర్వే చేసి సమగ్ర నివేదిక సమర్పించాలన్నారు. పువ్వాడ ఉదయ్ నగర్‌లో ఖాళీ ప్లాట్ల విషయమై చర్యలు తీసుకోవాలన్నారు. టేకులపల్లిలోని డబుల్ బెడ్‌రూం ఇండ్లలో లబ్ధిదారులు నివాసం లేనిపక్షంలో వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ స్థలాల్లో ఉన్న నిర్మాణాలను గుర్తించి వెంటనే తొలగించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు బి. సత్యప్రసాద్, డి.మధుసూదన్ నాయక్, ఖమ్మం నగరపాలక సంస్థ కమిషనర్ ఆదర్శ్ సురభి, శిక్షణా సహాయ కలెక్టర్లు మయాంక్ సింగ్, యువరాజ్, ఆర్డీవో జి.గణేశ్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మూడు రోజుల్లో ధాన్యం కొనుగోళ్లు

ఏప్రిల్ ఒకటో తేదీలోగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని కలెక్టర్ వీపీ గౌతమ్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో యాసంగి ధాన్యం సేకరణ కార్యాచరణపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత యాసంగిలో 1,71,357 మెట్రిక్ టన్నుల ధాన్యం మార్కెట్‌కు రానున్నట్లు అంచనా ఉందన్నారు. సెక్టార్లవారీగా ధాన్యం రవాణాకు ట్రాన్స్‌పోర్టు కాంట్రాక్టర్లను సిద్ధం చేయాలన్నారు. మిల్లర్లు, ట్రాన్స్‌పోర్టు కాంట్రాక్టర్లు, సంబంధిత వ్యక్తులతో సమావేశాలు నిర్వహించాలన్నారు. కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. నీడ, తాగునీరు తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. నాణ్యమైన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తెచ్చి కనీస మద్దతు ధర పొందేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్, జిల్లా వ్యవసాయాధికారి విజయనిర్మల, జిల్లా పౌరసరఫరాల అధికారి చందన్‌కుమార్, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ శ్రీలత, జిల్లా మార్కెటింగ్ అధికారి అలీం, జిల్లా సహకార అధికారి మురళీధర్‌రావు, డీఆర్డీవో సన్యాసయ్య, ఆర్టీవో ఆఫ్రీన్, డీఎం మార్క్‌ఫెడ్ సునీత, అధికారులు పాల్గొన్నారు.

జిల్లా సరిహద్దుల్లో నిఘా పటిష్టం

- విస్తృతంగా చెక్‌పోస్టులు.. 24/7 తనిఖీలు..
- నిఘా కోసం పోలీసులకు ప్రత్యేక వాట్సప్ గ్రూపులు
- సరిహద్దుల్లోని సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి
- వీసీలో ఖమ్మం సీపీ సునీల్‌దత్, ఏలూరు ఎస్పీ ప్రశాంతి

వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఖమ్మం సీపీ సునీల్‌దత్

ఖమ్మం, మార్చి 28: జిల్లా సరిహద్దుల్లో నిఘాను పటిష్టం చేశామని ఖమ్మం సీపీ సునీల్‌దత్, ఏలూరు ఎస్పీ మేరీ ప్రశాంతి పేర్కొన్నారు. అంతర్ రాష్ట్ర సరిహద్దు పోలీసుల సమష్టి కృషి, సమాచార మార్పిడితో ఫ్రీ అండ్ ఫెయిర్ ఎన్నికలు నిర్వహించాలని సూచించారు. పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో అంతర్ రాష్ట్ర సరిహద్దు జిల్లాలో అక్రమ రవాణాను, చట్టవ్యతిరేక కార్యకలాపాలను కట్టడి చేసేందుకు చేపట్టిన చర్యల్లో భాగంగా ఖమ్మం, ఏలూరు జిల్లాల పోలీస్ అధికారుల సమన్వయ సమావేశాన్ని గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ, ఎస్పీ మాట్లాడుతూ.. అంతర్ రాష్ట్ర, అంతర్ జిల్లా ప్రవేశ, నిష్క్రమణ మార్గాల్లో 24/7 చెక్‌పోస్టులను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇక్కడ విధుల్లో ఉండే పోలీసులు పకడ్బందీగా తనిఖీలు చేపట్టాలని, సరిహద్దులో పటిష్ట నిఘా పెట్టాలని సూచించారు. అక్రమ మద్యం రవాణా, నగదు సరఫరాపై నియంత్రణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల రవాణాను నియంత్రించాలన్నారు. ఎన్నికల నియమావళి పరిరక్షణే ధ్యేయంగా సరిహద్దు పోలీసు అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. రౌడీ షీటర్లపైనా, గతంలో అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన వారిపైనా ప్రత్యేక నిఘా పెట్టాలని సూచించారు. సరిహద్దులో హైవే పెట్రోలింగ్, మొబైల్ పెట్రోలింగ్ పెంచాలని అన్నారు. పోలీస్ అధికారులు వాట్సప్ గ్రూపులను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు సమాచారాన్ని అందించాలని సూచించారు. ఇరు రాష్ట్రాల పోలీసులు పరస్పర సహకారంతో పనిచేస్తూ ఎన్నికలు సజావుగా సాగేలా చర్యలు చేపట్టాలని అన్నారు. సరహద్దుల్లో ఉన్న సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించి తనిఖీలు చేయాలన్నారు. పోలీసు అధికారులు ప్రసాద్‌రావు, రఘు, ప్రసన్నకుమార్, రవిచందర్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

సర్వ మానవాళికి శుభ శుక్రవారం

మనుషులందరి పాపాల కోసం మృతి పొందిన దేవుడు 'క్రీస్తు'

ఏసు (రక్షకుడు) మరణం.. సకలపాప హరణం..

దేవుని ప్రేమకు పరాకాష్ఠ 'సిలువ మరణం'

భూమిపై మనిషిగా అవతరించిన సృష్టికర్త

నేడు ప్రత్యేక ప్రార్థనలకు సిద్ధమైన క్రైస్తవులు

ఖమ్మం/కొత్తగూడెం టౌన్, మార్చి 28 : కరుణామయుడు, ప్రేమామయుడు, దయామయుడు, సర్వ సృష్టికర్త అయిన దేవుడు భూమిపై మనిషిగా పుట్టి మనుషులందరి పాప విముక్తి కోసం సిలువపై మరణించిన రోజే గుడ్ ఫ్రైడే (శుభ శుక్రవారం). దేవుడు చేసిన సృష్టి అంతటిలో మనిషికి ప్రత్యేక స్థానం ఉంది. ఎందుకంటే మనిషిని దేవుడు తన పోలికలో సృష్టించాడని బైబిల్ చెబుతోంది. అయితే మనిషి పాపం చేసి దేవుడికి దూరంకావడంతో తొలుత మరణానికి తర్వాత నరకానికి వెళ్తున్నాడు. మనిషిని ఎంతగానో ప్రేమించిన దేవుడు అలా నరకానికి వెళ్లనీయకుండా అందరి పాపాలకు మారుగా తానే బలికావాలని నిర్ణయించుకున్నాడు. ఆ ఘోర నరక శిక్షను తప్పించి మనిషిని తనతోపాటు యుగయుగాలు పరలోకరాజ్యంలో జీవింపజేసేందుకు దేవుడే భూమిపై మనిషిగా జన్మించాడు. ముప్పై మూడున్నర సంవత్సరాలు జీవించిన యేసు (రక్షకుడు) సర్వ మానవాళికి పాప విముక్తి కలుగజేసేందుకు సిలువపై మృతిచెందాడు. ఏ పాపం ఎరుగని యేసు కన్య గర్భాన జన్మించి మూడున్నర సంవత్సరాలు సువార్తను ప్రకటించి యుక్త వయస్సులో మరణించాడు. తన శరీరంలోని రక్తమంతా కార్చాడు. అందరి పాపాల కోసం పరలోకం నుంచి భువికి దిగొచ్చిన దేవుడు(యేసు) 2024 సంవత్సరాల క్రితం శుక్రవారం రోజు కలువరి కొండపై మండుటెండలో సిలువపై ఘోరంగా శిక్షను అనుభవించి మృతిచెందాడు. మూడోదినాన ఆదివారం మృత్యుంజయుడిగా తిరిగి లేచాడు. అలా చనిపోయి తిరిగిలేచిన యేసు కొద్ది రోజులు అనేకమందికి కనిపించి పరలోకంలోని పరమతండ్రి వద్దకు ఆరోహణమయ్యాడు. మళ్లీ రెండోసారి వచ్చి తనను నమ్మిన వారిని పరలోకం తీసుకెళ్తానని వాగ్దానం చేశాడు. అంటే.. మనుషుల పాపాలకు వారు పొందాల్సిన శిక్షను యేసుక్రీస్తు సిలువపై భరించాడు. ఇంత గొప్ప యేసుక్రీస్తు త్యాగాన్ని గుడ్‌ఫ్రైడే రోజు స్మరించుకుంటూ క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. శుక్రవారం గుడ్ ఫ్రైడే సందర్భంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని చర్చిలను సుందరంగా అలంకరించారు. సిలువపై మృతిచెందే ముందు యేసుక్రీస్తు పలికిన ఏడు మాటలను పాస్టర్లు వివరించి బోధించనున్నారు. ఏసుక్రీస్తు చనిపోయిన సమయం మధ్యాహ్నం మూడు గంటలకు క్రైస్తవులందరూ ఒకేసారి మోకరించి ప్రార్థనలు చేస్తారు.

కొత్తగూడెంలోని సెయింట్ ఆండ్రూస్ చర్చి

నేడు గుడ్ ఫ్రైడే..

క్రీస్తు మరణ ఇతివృత్తాన్ని జ్ఞాపకం చేసుకుంటూ క్రైస్తవ సోదరులు శుక్రవారం గుడ్ ఫ్రైడే ప్రార్థనలు చేస్తారు. 41 రోజుల ఉపవాస దీక్షల సారాంశం కూడా ఇదే. ఇలా అన్ని ప్రార్థనా మందిరాల్లో అందరూ కలిసి ప్రత్యేక కన్నీటి ప్రార్థనలు, కీర్తనలు ఆలపిస్తారు. శుభ శుక్రవారం నాడు విశ్వాసులంతా కలిసి తమ కాలనీల్లో రోడ్లపై ప్రార్థనలు చేస్తారు. ప్రత్యేక కీర్తనలు ఆలపిస్తూ క్రీస్తు త్యాగాన్ని మననం చేసుకుంటారు. క్రీస్తు సిలువ మరణం పొందిన ఇతివృత్తాన్ని తెలియజేసేలా ప్రత్యేక వేషధారణలతో విశ్వాసులు ప్రదర్శనలు కూడా నిర్వహిస్తారు.

సిలువపై ఏసు పలికిన ఏడు మాటలు..

1. తండ్రీ వీరేమి చేయుచున్నారో వీరెరుగరు గనుక వీరిని క్షమించుము.
2. నేడు నీవు నాతో కూడా పరదైసులో ఉందువు.
3. అమ్మా ఇదిగో నీ కుమారుడు.. ఇదిగో నీ తల్లి..
4. నా దేవా.. నా దేవా నన్నెందుకు చేయి విడిచితివి.
5. నేను దప్పికగొనుచున్నాను.
6. సమాప్తమైనది.
7. తండ్రీ నీ చేతికి నా ఆత్మను అప్పగించుకొనుచున్నాను.

ఎల్లుండి ఈస్టర్..

క్రీస్తు కల్వరి కొండపై శిలువ మరణం పొందిన తరువాత అతని దేహాన్ని ఒక గుహలో దాచిపెడతారు. మూడో రోజు శిష్యులు వచ్చి చూడగా అక్కడ క్రీస్తు దేహం ఉండదు. 'నేను ఉన్నవాడను, అనువాడను.. జీవించువాడను, మూడో రోజు మరలా లేస్తానని' క్రీస్తు చెప్పిన విషయాన్ని శిష్యులు గుర్తు చేసుకుంటారు. అప్పుడు క్రీస్తు పునరుత్థానుడయ్యాడని శిష్యుల నమ్మకం. ఈ విషయాన్ని జ్ఞాపకం చేసుకునేందుకు క్రైస్తవులు ఈ ఉపవాస దీక్షలు ముగించుకొని ఆదివారం ఈస్టర్ పండుగను జరుపుకుంటారు. క్రీస్తు మరలా లేచాడనే గొప్ప సువార్తను ప్రకటిస్తారు. సంతోష గానాలతో కీర్తనలు పాడి స్తుతులు చెల్లిస్తారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు జరుగుతాయి.

నామా గెలుపే లక్ష్యంగా పని చేయాలి

మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్‌లాల్

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మదన్‌లాల్

కారేపల్లి, మార్చి 28 : పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు గెలుపే లక్ష్యంగా పని చేయాలని మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్‌లాల్ అన్నారు. కారేపల్లి క్రాస్‌రోడ్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు స్వప్రయోజనాల కోసం పార్టీని ఉపయోగించుకున్న కొందరు అవకాశవాదులు ఇప్పుడు పార్టీని వీడుతున్నారని, అలాంటి వారు వెళ్లినా పార్టీకి నష్టమేమీ లేదన్నారు. అధికారంలో ఉన్నా, లేకున్నా ఎల్లప్పుడూ కార్యకర్తలకు అందుబాటులో ఉండి అండగా నిలుస్తానని ధైర్యం చెప్పారు. అనంతరం గేట్ రేలకాలపల్లి, బోటితండా, చీమలపాడు గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమాల్లో జడ్పీటీసీ వాంకుడోత్ జగన్, ఎంపీటీసీ శంకర్, బీఆర్ఎస్ నాయకులు ఉన్నం వీరేందర్, తాతా వెంకన్న, జడల వెంకటేశ్వర్లు, డొంకెన రవీందర్, ఎస్‌కే.గౌసుద్దీన్, పాటి రాంబాబు, రవీందర్‌రెడ్డి, సైదులు, ధరావత్ వికాస్, బానోత్ రాజేశ్, స్వామి, చందు, హతీరాం, గణితి సత్యం, ముత్యాలరావు, మధు, రవి కుమార్, శంకర్, బావ్‌సింగ్, వెంకటేశ్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లకు 128 కేంద్రాలు

భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక ఆల

మాట్లాడుతున్న భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక ఆల

భద్రాద్రి కొత్తగూడెం, మార్చి 28 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో యాసంగి ధాన్యం కొనుగోళ్లకు 128 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు భద్రాద్రి కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల తెలిపారు. గురువారం ఐడీవోసీలోని సమావేశ మందిరంలో జిల్లా పౌరసరఫరాల సంస్థ శాఖ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియపై కొనుగోలు కేంద్రాల ఇంఛార్జిలు, వ్యవసాయ, సహకార, డీఆర్‌డీఏ, తూనికలు కొలతలు, రవాణా, మార్కెటింగ్ శాఖ అధికారులు, రైస్ మిల్లర్లతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 1,11,369 మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందనే అంచనాతో ఉన్నామన్నారు. ఏ గ్రేడ్ ధాన్యం రూ.2,203, బీ గ్రేడ్ రకం రూ.2,183గా మద్దతు ధర నిర్ణయించినట్లు చెప్పారు. ఏప్రిల్ ఒకటో తేదీన 61, 5న 36,19న 31 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలన్నారు. అనంతరం మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన ధాన్యం మద్దతు ధర, నాణ్యతా ప్రమాణాలకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, డీఆర్‌డీవో విద్యాచందన, పౌరసరఫరాల సంస్థ మేనేజర్ త్రినాథ్, పౌరసరఫరాల శాఖ అధికారి రుక్మిణి, డీసీవో ఖుర్షీద్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ రవాణా కట్టడికి యాక్షన్ ప్లాన్

సరిహద్దు రాష్ట్రాల అధికారుల సమీక్షలో ఉమ్మడి జిల్లా ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ జనార్దన్‌రెడ్డి

మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్ జనార్దన్‌రెడ్డి

సారపాక/భద్రాచలం, మార్చి 28 : పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో పొరుగు రాష్ట్రాల నుంచి మద్యం, నాటుసారా, గంజాయి వంటి మత్తు పదార్థాలు అక్రమంగా రవాణా చేయకుండా యాక్షన్ ప్లాన్ రూపొందిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ జనార్దన్‌రెడ్డి అన్నారు. గురువారం సారపాక ఐటీసీ పీఎస్‌పీడీలోని మయూరి క్లబ్‌లో జిల్లా ఎక్సైజ్ అధికారి జానయ్య ఆధ్వర్యంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల ఎక్సైజ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే పొరుగు రాష్ట్రాల సరిహద్దుల వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి సమన్వయంతో తనిఖీలు చేస్తున్నామన్నారు. ఎన్నికల దృష్ట్యా పొరుగు రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున మద్యం, గంజాయి, నాటుసారా తరలించకుండా ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. సంబంధిత శాఖల అధికారులు ఎప్పటికప్పుడు సమాచారం అందించుకుంటూ సమష్టిగా దాడులు నిర్వహించాలని, ఎన్నికల నియమ నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచించారు. సమావేశంలో ఉమ్మడి జిల్లా అసిస్టెంట్ కమిషనర్ గణేశ్, ఏలూరు జిల్లా అడిషనల్ ఎస్పీ సూర్యచందర్‌రావు, ఏలూరు, సుక్మా, బీజాపూర్, కొత్తగూడెం జిల్లాల ఎక్సైజ్ సూపరింటెండెంట్లు రామకృష్ణ, గజేందర్, రాథోడ్, రాహుల్, కరమ్‌చంద్, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.